క్లుప్తంగా

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



పొన్నూరు: స్వచ్ఛ పొన్నూరు సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్‌బాబు అన్నారు. స్థానిక 9,10 వార్డులలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రజల నుద్దేశించి మాట్లాడారు. పట్టణాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పురపాలక పరంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు రహదారులపై చెత్త వేయకుండా సహకరించాలని తెలిపారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వార్డులలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తైవాన్ స్ప్రేయర్లు అందించాలి



పొన్నూరు: వ్యవసాయానికి సంబంధించిన తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు, వరి కోత మిషన్లను ప్రభుత్వం వెంటనే అందించాలని రైతులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని కట్టెంపూడి, పచ్చల తాడిపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలాలను తొలుత జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఐ.సునీత, లాం సైంటిస్ట్ డాక్టర్ పి.అమర జ్యోతి, స్థానిక ఏడీఏ రామకోటేశ్వరి సందర్శించారు. చీడపీడలను గుర్తించి చేపట్టాల్సిన చర్యలపై తగు యాజమాన్య పద్ధతులను వివరించారు. మండలంలోని 29 గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏడీఏ రామకోటేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య పాల్గొన్నారు

స్వచ్ఛమైన నీటితో వ్యాధులు దూరం

ప్రత్తిపాడు: స్వచ్ఛమైన నీటిని తాగడం ద్వారా సాధ్యమైనంత వరకు వ్యాధులు దరిచేరవని స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కోయవారి పాలెంలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును పరిశుభ్రం చేశారు. ట్యాంకును క్లీన్ చేసి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించడంతో పాటు, ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు కూడా నిర్వహించాలని చెప్పారు. అదేవిధంగా గ్రామంలోనికి క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి ఆర్.వీరమల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.శ్వేత పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


పొన్నూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు నిర్వహించాలని ఎంఈఓ ఏపీఎం ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హెచ్ఎంలు తప్పక ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల యాప్, మార్క్స్ తెలియచేసే ఆన్‌లైన్ యాప్‌లను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

కాకుమాను ఎంపీడీఓగా యుగకీర్తి బాధ్యతల స్వీకారం



కాకుమాను: మండల ఎంపీడీఓగా కొండా యుగకీర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె ప్రకాశం జిల్లా తాళ్లూరు మండల ఎంపీడీఓవోగా విధులు నిర్వహిస్తు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన యుగకీర్తి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన రామకృష్ణ, పెదకూరపాడు బదిలీ అయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సమష్టిగా పనిచేయాలి



గుంటూరు రూరల్: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సమష్టిగా పని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ సూచించారు. ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని కోరారు.

రైతును నిండా ముంచిన వరద



తంగెళ్లమూడి శివార్లలో వరదనీటిలో కుళ్లిపోయిన వరి పైర్లు



వెంకటకృష్ణాపురం నంబూరు గ్రామాల మధ్య ఎండిపోయిన వరిపైరు

- వేల ఎకరాల్లో వరికి నష్టం
- నష్ట అంచనాలు తయారు చేసిన అధికారులు

పెదకాకాని: పచ్చని పంట పొలాలను వరద ఊడ్చేసింది. అన్నదాతల్లో నిండా ముంచింది. 20 రోజుల కిందట వరదనీరు పంట పొలాల్లోకి చేరడంతో పాటు రోజుల తరబడి పొలాల్లోనే ఉండటంతో వరి పైరు నీటిలో మునిగి కుళ్లిపోయింది. 10 రోజుల నుండి 15 రోజులకు వరి పొలాల్లో నుంచి వరదనీరు బయటకు పోవడంతో అప్పటికే అన్నదాతలకు జరగాల్సిన నష్టం జరిగింది. వరదనీటిలో కుళ్లిపోయిన వరిపైరు నీరు బయటకు పోయే సరికి ఎండిపోయింది. ఈ దశలో వరి పొలాలు దుక్కులు దున్ని మళ్లీ వరి విత్తనాలు పెట్టాలంటే సమయం చాలదు, ప్రస్తుతం వరి పైరు సాగు చేసే ప్రయత్నాలు విరమించుకుంటే మంచిదని పలువురు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఎంత నష్టం..

వరి సాగులో ఇప్పటికే రైతులు విత్తనాలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందుల రూపంలో ఎకరానికి 12 వేల రూపాయల నుంచి 15 వేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టారు. కౌలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మరింత దయనీయం. ఈ క్రాప్ బుకింగ్ చేసిన రైతులకు మాత్రమే పంట నష్టం గుర్తించి నమోదు చేయడం సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ పలువురు పొలం యజమానులు కౌలు రైతులకు పొలం డాక్యుమెంట్లు గానీ, పట్టాదారు పాసుపుస్తకాలు కానీ ఇవ్వకపోగా కౌలు రైతుల పేరిట ఈ క్రాప్ బుకింగ్‌కు అంగీకరించడం లేదు. దీంతో పంట నష్ట పరిహారం అందుతుందో లేదోనని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సాగు చేయడానికి మరో రెండు నెలలు సమయం ఉంది. పలువురు రైతులు ఎకరానికి 18 వేల రూపాయల నుంచి రూ.25 వేలు వరకూ ఖర్చు చేసి వరినారు సేకరించి నాట్లు వేస్తున్నారు. అంత డబ్బులు ఖర్చు చేయలేని రైతులు రబీసాగు కోసం వేచి చూస్తున్నారు.

పంట నష్టంపై నివేదిక అందజేశాం..

పెదకాకాని మండలంలో వరి పంట 7,631 ఎకరాలు, మినుము 120 ఎకరాలు, పత్తి 70 ఎకరాలు దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పి.సంధ్యారాణి వెల్లడించారు. పంట సాగుపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ ఏడాది అంతా నష్టమే..



ఈ ఏడాది అంతా పంటల సాగు నష్టమే. 15 ఎకరాలు సొంత పొలం ఉంటే దానితో పాటు మరో 25 ఎకరాలు కౌలు పొలం తీసుకుని మొత్తం 40 ఎకరాలు సాగు చేస్తున్నా. 15 ఎకరాల వరకూ పంట వరదనీటిలో కుళ్ళిపోయింది. ఖాళీ పొలం పెట్టుకుని చూస్తూ ఉండలేక పల్నాడు జిల్లాకు వెళ్ళి వరినారు తెచ్చి నాట్లు వేసుకుంటున్నాం. ఎకరానికి వరినారు కొనుగోలు, కూలీల ఖర్చు, బాడుగ కలసి పొలానికి చేరా రూ.20 వేలు అవుతుంది. ఈ ఏడాది పంటల దిగుబడులు కూడా తగ్గే ప్రమాదం ఉంది. ఎన్ని బస్తాలు పండినా చేసేదేమీలేదు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

–కందుల వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణాపురం, రైతు.

గులాబిరంగు పురుగుపై అప్రమత్తం



గొట్టిపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

ప్రత్తిపాడు: గులాబి రంగు పురుగులపై పత్తి రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారి కె.అరుణకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని గొట్టిపాడులో పత్తి పంట పొలాన్ని సందర్శించారు. పత్తిని ఆశిస్తున్న తెగుళ్ల, చీడపీడలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తి పంటలో వంద రోజుల నుంచి 125 రోజుల్లోపల గులాబిరంగు పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. అందుచేత పురుగులను నివారించేందుకుపత్తి రైతులు పొలంలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు సామూహికంగా లింగాకర్షక బుట్టలను పొలాల్లో పెట్టడం ద్వారా చాలా వరకు గులాబిరంగు పురుగు ఉధృతికి అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. మండలంలోని గొట్టిపాడు, కోయవారిపాలెం గ్రామాల్లోని పత్తి రైతులకు సామూహిక నివారణలో భాగంగా లింగాకర్షక బుట్టలను యాభై శాతం రాయితీపై అందించామని వివరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, సేంద్రియ వ్యవసాయం మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో స్వర్ణాంధ్ర- 2047 పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు రూరల్: ప్రపంచ చిత్ర పటంలో ఆంధ్రరాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలపటమే సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ లక్ష్య సాధనలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర 2047 సాధనలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ, మహిళా సాధికారత, మెరుగైన విద్య, మేలైన వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం తదితర రంగాలలో ఆర్థిక వృద్ధి సాధనకై అన్ని వర్గాల అభిప్రాయాలను సలహాలను సూచనలను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రెవిన్యూ అధికారులు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి స్వర్ణాంధ్ర 2047 పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డెప్యూటీ ఏఎస్ఓలు శ్రీనవాసరావు, సుబ్బారావు, వి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్వచ్ఛతా హి సేవ



నంబూరులో వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

పెదకాకాని: వీవీఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మంగళవారం మండలంలోని నంబూరు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వంటి వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్యరహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని లక్ష్యంతో గ్రామంలో క్లాత్‌బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి 23 వరకూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి మూడు కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి నంబూరు పంచాయతీకి అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచారు. విద్యార్థులు గ్రామంలో మానవహారం నిర్వహించి గ్రామస్తులచే స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమములో గ్రామ పంచాయతీ సెక్రటరీ మహ్మద్ లుత్ఫాన్ సాధిక్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐఎల్‌జె భక్తసింగ్, టివిజయ్ కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

లాం ఫాం శాస్త్రవేత్త అమరజ్యోతి



వేజండ్లలో మాట్లాడుతున్న లాం ఫాం శాస్త్రవేత్త అమర జ్యోతి

చేబ్రోలు: రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని లాం ఫాం శాస్త్రవేత్త పి.అమరజ్యోతి అన్నారు. చేబ్రోలు, వేజెండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లాం ఫాం శాస్త్రవేత్త పి.అమర జ్యోతి మాట్లాడుతూ ఈ సీజన్‌లో వరిలో ఆకు చుట్టు పురుగు, కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తున్నాయన్నారు. కాబట్టి వాటి ఉనికిని బట్టి పురుగు మందులు పిచికారి చేయాలని సూచించారు. వెటర్నరీ డెప్యూటీ డైరెక్టర్ బాల శివ కిషోర్ మాట్లాడుతూ పెయ్యదూడలు కొరకు ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, మండల వ్యవసాయ శాఖాధికారి బి.శ్రీనివాస్ నాయక్, ఏఈఓ సునీత, వీఏఏ ప్రవీణ్ కుమార్, జోనాథన్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గుంటూరు రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాలుష్యం బారినుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జాతీయ నమూనా సర్వే కార్యాలయం గుంటూరు ఇన్‌చార్జి(ఎస్ఎస్ఓ) డి.హనుమంతరావు తెలిపారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా 41వ డివిజన్ స్వర్ణభారతీనగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మజ, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయిని జయశ్రీ పాల్గొన్నారు.

అక్టోబర్ 21న అష్టావధానం

పొన్నూరు: బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో అక్టోబరు 21వ తేదీన శంకరమఠంలో అష్టావధానం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ మహాసభ పూర్వ అధ్యక్షుడు పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలోని విద్యావంతులకు, విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని పరిచయం చేయాలనే ఉద్దేశంతోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అద్దంకి పట్టణానికి చెందిన అవధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం నిర్వహణలో జరుగుతుందన్నారు.

నేడు తక్కెళ్లపాడులో కంటి వైద్య శిబిరం

పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడులో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ కళ్యాణమండపంలో ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు.

నేడు, రేపు స్వర్ణాంధ్ర- 2047 గ్రామసభలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర- 2047కు సంబంధించి గ్రామ సభలను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా తెలిపారు. బుధవారం నాడు ఈదులపాలెం, యనమదల, గనికపూడి, కొండేపాడు, కోయవారిపాలెం, కొత్తమల్లాయపాలెం, నడింపాలెం, పాతమల్లాయపాలెం, తిక్కిరెడ్డిపాలెం, వంగిపురం, 26న గొట్టిపాడు, నిమ్మగడ్డవారిపాలెం, మేడావారిపాలెం, ప్రత్తిపాడు, తుమ్మలపాలెం, తిమ్మాపురం గ్రామాల్లో సభలు జరగనున్నట్లు తెలిపారు.

శ్రీరామ్ నరేంద్రకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ పరిశోధకుడు వి.శ్రీరామ్ నరేంద్రకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఎకనామిక్స్ విభాగ పరిశోధనా పర్యవేక్షకుడు ఆచార్య మధుబాబు పర్యవేక్షణలో 'యాన్ ఎకనామిక్ అనాలసిస్ ఆఫ్ హాండిక్రాఫ్ట్స్ ఇన్ కృష్ణా డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో మెగా రక్తదాన శిబిరం

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సమాజ సేవపై అవగాహన కలిగి ఉండాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు 20 యూనిట్ల రక్తదానం చేశారు. ఆమె మాట్లాడుతూ జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా సేవా దృక్పథాన్ని చాటుకున్న విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్ రోజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.ఆదిలక్ష్మి, పీడీ జీ బాలశౌరిరెడ్డి, కె.సుస్మిత పాల్గొన్నారు.

నూతన సాగు పద్ధతులపై అవగాహన



తక్కెళ్ళపాడు శివార్లలో వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెదకాకాని: నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వెంకటేశ్వర్లు అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో రైతులకు సాంకేతిక సమాచారం ఇవ్వడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు, కొత్త వంగడాలు, జింక్ సల్ఫేట్(ముడిజింక్) టార్పాలిన్ పట్టాలు వంటివి కావాల్సిన వారు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పైర్లను ఆశించే తెగుళ్ళు, పురుగు నివారణకు చేపట్టవలసిన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శివాజీ, వీఏఏలు ప్రియాంక, మెర్సీ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
- నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు ప్రారంభం



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల



అండర్-17 విభాగంలో విజేతలుగా నిలిచిన బాలికల టీం

ప్రత్తిపాడు: క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక శ్రమ అవసరమన్నారు. క్రీడల వలన శారీరక బలం వస్తుందని, మానసిక బలాన్ని రెట్టింపు చేస్తుందన్నారు. వీటి వలన ఏకాగ్రత, క్రమశిక్షణ వస్తాయని చెప్పారు. గురువులను పూజించాలని, తల్లిదండ్రుల తరువాత స్థానం వారిదేనని తెలిపారు.

అట్టహాసంగా పోటీలు..

నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాలీబాల్, బ్యాడ్మింటన్, పోటీలను బాలబాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల నుంచి సుమారు వంద మందికిపైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి. డేవిడ్‌రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి పి.వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ అబ్దుల్ రవూఫ్, ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణి, హెచ్ఎం హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయడానికే..

ప్రజలకు మేలు చేయడానికి మంచి మనసు ఉండాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పల్లపాడు గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నామమాత్రంగా 'నైట్ బీట్'

- హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్న దొంగలు
- గస్తీ లేకపోవడంతో రేషన్ మాఫియాకు రూట్ క్లియర్
- అర్ధరాత్రి వరకూ దాబాలు, రెస్టారెంట్లు

ప్రత్తిపాడు: పోలీసింగ్‌లో కీలకమైనది నైట్‌బీట్. రాత్రి పూట జరిగే అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలను. నేరస్తుల కదలికలను కొంత మేర తగ్గించడంలో రాత్రి గస్తీ దోహదపడుతుంది. అలాంటి గస్తీని ప్రత్తిపాడు పోలీసులు నామ్‌కే వాస్తేగా నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా మండలంలో పూర్తిస్థాయిలో నైట్‌బీట్ ఆనవాళ్లే కనిపించడం లేదు.

గతంలో రెండు బీట్‌లు..

గతంలో ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో రెండు నైట్ బీట్లు వేసేవారు. ఒక బీట్ పోలీసులు రాత్రి పది గంటలకు ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని దుకాణాలు రెస్టారెంట్లు మూసివేయించి మెయిన్‌రోడ్‌పై గస్తీ ఉండేవారు. మరో బీట్ జాతీయ రహదారిపై గస్తీ తిరిగి దాబాలు మూసివేయించి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేవాళ్లు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం ఒకే ఒక్క బీట్ వేసి అది కూడా హైవే వరకే పరిమితం చేశారు. అది కూడా స్టాఫ్ అందుబాటులో ఉన్నప్పుడే. దీంతో 100 డయల్ వచ్చినా, ప్రమాదం జరిగినా, గొడవలు జరిగినా ఆ ఒక్క బీట్ సిబ్బంది మండలం అంతా పరుగులు పెట్టాల్సి వస్తుంది. దొంగతనాలతో పాటు హైవేపై వ్యభిచారం జోరుగా సాగుతోంది. దాబాలు, రెస్టారెంట్లు అయితే అర్ధరాత్రి వరకూ నిర్భయంగా వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. గతంలో ఒక దాబాలో బీరు సీసాలతో దాడులకు పాల్పడి తలకాయలు పగలగొట్టుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. దీంతో నైట్‌బీట్‌కు మరలా పూర్వ వైభవం తీసుకువచ్చి, పక్కాగా అమలయ్యేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్క బీట్ మాత్రమే వేస్తున్నాం: కె.నాగేంద్ర, ఎస్ఐ, ప్రత్తిపాడు

రాత్రి పూట ఒక్క బీట్‌నే వేస్తున్నాం. బీట్ సిబ్బంది జాతీయ రహదారిపై గస్తీ నిర్వహిస్తారు. 100 డయల్ వంటి వాటికి కూడా వారే నిర్వహిస్తారు. మరింతగా బీట్‌లు పెంచి, నిఘాను పెంచేలా చర్యలు తీసుకుంటాం.

ఆటపాటలతో ప్రీ స్కూల్ విద్య

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి



కొండేపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులు, తల్లులతో సూపర్‌వైజర్ మాధవి

ప్రత్తిపాడు: ఆటపాటలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యనందించడం జరుగుతుందని గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని తుమ్మలపాలెం, పార్వతీపురం, గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని కొండేపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రాముఖ్యతపై మహిళలకు వివరించారు. ప్రీస్కూల్ కిట్లు, బొమ్మలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు పి.మాధవి, ఎస్.భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార కేంద్రాలుగా మాత్రమే చూడకుండా విద్యాబోధన కేంద్రాలుగా చూడాలన్నారు. చిన్నారులకు సరైన పోషకాహారం అందించడం ద్వారా వారిలో నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు యశోద, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉచిత కాలేయ పరీక్ష శిబిరానికి అనూహ్య స్పందన



ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు రూరల్: మానవ శరీరంలో కాలేయం ఆరోగ్యంగా ఉంటే మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో ఉచిత కాలేయ పరీక్షల శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లివర్ ఫంక్షనింగ్ పరీక్షలు ఉచితంగా చేసి అర్హులకు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా పలు రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చీఫ్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పలు ప్రాణాంతక వ్యాధులను మొదలులోనే గుర్తించి వాటికి వెంటనే మందులు వాడినట్టయితే ప్రాణాంతకం కాకుండా నివారించవచ్చని తెలిపారు. లివర్ వ్యాధులకు ఆయుర్వేద మందులు ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా నివారణ సాధ్యమని చెప్పారు. ఆయుర్వేద వైద్యంలో స్పెషలిస్ట్ వైద్యులు గోరంట్ల శివారుల్లోని తమ ఆసుపత్రిలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భానుకాశ్యప్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ రాహుల్, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయపడిన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలు సినిమా హాలు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల జిల్లా చుండూరు మండలానికి చెందిన బోడపాటి సుబ్బారావు ద్విచక్ర వాహనంపై చేబ్రోలు నుంచి చుండూరు వెళ్తున్నాడు. చేబ్రోలు సినిమా హాలు సమీపంలో ప్రమాదవశాత్తూ ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బోడపాటి సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు సచివాలయం సమయపాలన లేక.. అవస్థలు పడుతున్న ప్రజలు

గుంటూరు రూరల్: నగరంలోని 41వ డివిజన్ అడవి తక్కెళ్లపాడులోని 179 వార్డు సచివాలయం ఉదయం 11 గంటలైనా తెరుచుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఏదైనా సమస్యల పరిష్కారం కోసం వస్తే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండడం లేదని చెప్పారు. అదేమని అధికారులను అడిగితే సచివాలయం పరిధిలో పనిచేసేవారంతా ఇన్‌చార్జిలేనని వారికి మరో సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన పని ఉండటంతో ఏదో మొక్కుబడిగా వస్తూ పోతూ ఉంటున్నారని చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యత అని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా నగర శివారుల్లోని లాం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ జె.లక్ష్మీనారాయణ, డి.తిరుపతినాయక్, ఏ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.